TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం

ఎడిటర్ : కనుకుల ఆనంతరెడ్డి

జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 273 | ఆదివారం, అక్టోబర్ 25, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు

మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా..

**మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి**

**సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా**

**తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం**

**సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి**

**మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

# ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు

**ఆధారాలు ఉంటే చూపండి: రేవంత్‌కు బీజేపీ సవాల్**

**ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ**

**ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్**

**'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ**

**నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్‌లో బీజేపీ యాత్రలు**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు పాల్గొంటుండడాన్ని కూడా రాంచందర్ రావు తప్పుబట్టారు. దీనికి ప్రతిగా, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకానికి వ్యతిరేకంగా పోరాడండి' అనే నినాదంతో బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై, ఆ తర్వాత సిద్ధిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.



# బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు..

**బందోబస్తు మధ్య తరలింపు**

**హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తాలో రాముడి విగ్రహం తొలగింపు**

**విజయదశమి నాడు హిందూ సంఘాలు ఏర్పాటు చేసిన విగ్రహం**

**అనుమతులు లేవంటూ ఎంబీటీ నేతల అభ్యంతరం**

**పేరు మార్పు వివాదం నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు**

**క్రేన్ సహాయంతో విగ్రహాన్ని తొలగించిన ఆలయ సిబ్బంది**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని



హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని శనివారం అధికారులు తొలగించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతిష్ఠించిన ఈ విగ్రహం చుట్టూ పేరు మార్పు వివాదం నెలకొనడంతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్‌తో అనుబంధం ఉన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని కూడలిలోని అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, బషీర్‌బాగ్‌ను ఇకపై "శ్రీరామ్ చౌక్"గా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిణామం నగరంలో రాజకీయ వివాదానికి దారితీసింది. విగ్రహ ఏర్పాటు, పేరు మార్పు ప్రతిపాదనపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ లేదా నగర పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ ప్రశ్నించారు. కూడలి పేరు మార్పుపై ప్రకటనలు వస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఏవైనా అధికారిక ప్రతిపాదనలు ఉన్నాయా అని ఆయన స్పష్టత కోరారు. అభ్యంతరాలు వ్యక్తమై వివాదం తీవ్రతరం కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. శనివారం ఉదయం ఆలయ సిబ్బంది క్రేన్ సహాయంతో శ్రీరాముడి విగ్రహాన్ని జాగ్రత్తగా తొలగించి లారీలోకి తరలించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పోలీసులు దగ్గరుండి పర్యవేక్షించారు. సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ముగిసిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# మహిళలపై నేరాల కేసులు.. దేశంలోనే ఏపీకి రెండో స్థానం!

**దేశవ్యాప్తంగా 187 మంది ప్రజాప్రతినిధులపై కేసులు**

**జాబితాలో బీజేపీ టాప్, టీడీపీకి మూడో స్థానం**

**14 మందిపై అత్యాచారం కేసులు.. ఐదుగురు కేంద్ర మంత్రులపై ఆరోపణలు**

**నేరచరిత ఉన్నవారిని అనర్హులుగా ప్రకటించాలన్న ఏడీఆర్**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని



చట్టసభల్లో మహిళల హక్కులు, రక్షణ గురించి మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులే మహిళలపై అఘాయిత్యాలు, వేధింపుల కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న చేదు నిజాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక బట్టబయలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసులను విశ్లేషించి శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదికలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏడీఆర్ నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న 4,881 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించగా, మొత్తం 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. వీరిలో 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరిలో 14 మందిపై (12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు) నేరుగా అత్యాచారం (ఐపీసీ సెక్షన్ 376) కేసులు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**తెలుగు రాష్ట్రాల్లో కలవరపరిచే గణాంకాలు..**

మహిళలపై నేరాల కేసులున్న ప్రజాప్రతినిధుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 22 మందితో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వంలోని నలుగురు మంత్రులపై కూడా ఇలాంటి కేసులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఒక వివాదస్పద ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు ఉందని, ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ఒక యువ ఎంపీతో పాటు రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ నేతపై కూడా అభియోగాలున్నట్లు తెలిపింది. తెలంగాణలో మొత్తం ఐదుగురు ప్రజాప్రతినిధులపై (ముగ్గురు లోక్‌సభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు) కేసులున్నాయి. వీరిలో ముగ్గురు బీజేపీ ఎంపీలు కాగా, తొలిసారి గెలిచిన ఒక సిట్టింగ్ ఎంపీపై అత్యాచారం కేసు నమోదై ఉండటం గమనార్హం.

**పార్టీలు, రాష్ట్రాల వారీగా వివరాలు..**

పార్టీల వారీగా చూస్తే, బీజేపీకి చెందిన 106 మంది (95 మంది ఎమ్మెల్యేలు, 11 మంది ఎంపీలు) ఈ జాబితాలో ఉండి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 18 మంది (17 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) ప్రజాప్రతినిధులు మూడో స్థానంలో ఉన్నారు. బీజేపీకి చెందిన 11 మంది ఎంపీలలో ఐదుగురు కేంద్ర మంత్రులు కాగా, వారిలో ఒకరు తెలుగు రాష్ట్రాలకు చెందినవారని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల పరంగా పశ్చిమ బెంగాల్ (69) మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ (22) రెండో స్థానంలో, ఒడిశా (17) మూడో స్థానంలో నిలిచాయి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇలాంటి నేర చరిత్ర ఉన్నవారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, వారి కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ద్వారా వేగంగా విచారించి శిక్షలు ఖరారు చేయాలని ఏడీఆర్ డిమాండ్ చేసింది.

# సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం.. ఆర్థిక సాయం పెంపు

**సివిల్స్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు**

**బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైఫండ్ రూ. 7 వేలకి పెంపు**

**పుస్తకాల ఫండ్ రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు రెట్టింపు**

హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని



సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# 45 రోజుల్లో రైస్ మిల్లుల బకాయిలు 100 శాతం చెల్లించాలి

**అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**బకాయిలు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తుల జప్తు**

**బకాయిలు చెల్లించిన మిల్లర్లకే వచ్చే సీజన్‌లో బియ్యం కేటాయింపులు**






**నేటి ప్రభాత దర్శిని పెద్దపల్లి, అక్టోబర్ 24:**

రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను 45 రోజుల్లోగా 100 శాతం చెల్లించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్ రాజుతో కలిసి 15 మంది డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో ఆయన బకాయిల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నంబర్ 17 ప్రకారం రైస్ మిల్లర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు 45 రోజుల గడువు ఇచ్చినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని లేదా బకాయిలకు సమానమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. 45 రోజుల గడువులోగా బకాయిలను పూర్తిగా చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా, రాబోయే సీజన్‌లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బియ్యం కేటాయింపులు జరగాలంటే ముందుగా వారు తమ పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి, తదుపరి సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి , జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్ రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో అంతరాష్ట్ర సరిహద్దు తనఖీ కేంద్రం ఏర్పాటు

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణలోకి తరలించకుండా నిరోధించేందుకు ఈ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో 24 గంటల పాటు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల సంక్షేమం, పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, పోలీస్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూతురు వివాహానికి కేటిఆర్ ను ఆహ్వానిఉచిన మాజి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దంపతులు

**చొప్పదండి, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

నందినగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాద పూర్వకంగా కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దంపతులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే నెల 22న జరగనున్న తమ చిన్న కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ కేటీఆర్ కు లగ్నపత్రికను అందజేసినట్లు తెలిపారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలి





**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**రానున్న 10 నెలల పాటు మనుషులు, పశువుల త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా కోతలు లేకుండా నిరంతరాయ సరఫరా**

**నీటిని సంరక్షిస్తూ త్రాగునీటికి ప్రాధాన్యమివ్వాలి**

**నీటి సంరక్షణ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు చర్యలు**

**సూపర్ ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలి**

**నేటి ప్రభాత దర్శిని అక్టోబర్– 24:**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 150 దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రానున్న రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించిన అనంతరం కొదుమూరు గ్రామంలో డిప్యూటీ సిఎం మీడియా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీరు ఆవిరైపోవడంతో పాటు భూగర్భ జలాలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. రాబోయే 10 నెలల పాటు మనుషులు, పశువుల త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 44 వేల చెరువుల్లో సుమారు 40 శాతం చెరువుల్లో కనీసం పావు వంతు కంటే తక్కువ నీరు ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను ప్రజలు, రైతులు పాటిస్తూ ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

**విద్యుత్ డిమాండ్ పెరిగినా కోతలు లేకుండా సరఫరా:**

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. 2014లో రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6,648 మెగావాట్లు ఉండగా, 2023లో 15,497 మెగావాట్లకు చేరిందని, ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతోందని వివరించారు. గృహ అవసరాలు, వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ అధికమవుతోందని తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో రోజుకు 245 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వస్తే, ప్రస్తుతం రోజుకు 335 మిలియన్ యూనిట్ల, దాదాపు 37 శాతం అధికంగా డిమాండ్ పెరిగిందని అన్నారు. డిమాండ్ పెరుగుదలను ముందుగానే అంచనా వేసి, నిపుణులతో చర్చించి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం వల్ల విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయగలుగుతున్నామని తెలిపారు. అక్టోబర్ నెలలో విద్యుత్ అవసరాలు అధికంగా పెరిగినప్పటికీ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. ఒకవైపు విద్యుత్ డిమాండ్ పెరుగుతూ, మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలు తగ్గుతున్నాయని వివరించారు.

**సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు:**

విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో కొత్తగా 680 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయగా, 177 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ట్రాన్స్‌కో పరిధిలో 24 సబ్ స్టేషన్లకు అనుమతులు మంజూరు చేయగా, 11 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు.

**పంపుసెట్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి:**

రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండగా, వాటిలో దాదాపు 15 లక్షల పంపుసెట్లు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ప్రభావితమయ్యాయని డిప్యూటీ సీఎం తెలిపారు. నీరు లేకున్నా మోటార్లు నడపడం, ఒకేసారి అధిక విద్యుత్ లోడ్ పడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా యని చెప్పారు. భూగర్భ జలాలు అందుబాటులో లేనప్పుడు మోటార్లు ఆన్ చేయవద్దని, పంపుసెట్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగించాలని రైతులకు సూచించారు. విద్యుత్ వినియోగంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకం క్రింద ఇప్పటి వరకు ప్రభుత్వం పేద కుటుంబాల తరపున డిస్కంలకు రూ. 5,000 కోట్లు చెల్లించిందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు డిస్కంలకు చెల్లిస్తోందని వివరించారు. గ్రామాల వారీగా వ్యవసాయ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై రైతులకు తగిన సూచనలు అందించాలని తెలిపారు.

**ఉపాధి హామీ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన:**

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం క్రింద పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన మేరకు నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం వీబీ–జీ రామ్ జీ పథకం క్రింద రాష్ట్రంపై 40 శాతం నిధుల భారం ఉన్నప్పటికీ, కేంద్రం మంజూరు చేసిన 9 లక్షల పనులతో పాటు మరో 8 లక్షల పనులను గుర్తించేందుకు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, బోర్ రీఛార్జ్ పిట్లు, పశువుల షెడ్లు, నీటి తొట్టెలు, రోడ్ల నిర్మాణం వంటి పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం క్రింద చేపడతామని తెలిపారు. కాలువలను శుభ్రం చేయడం, చెరువుల్లో పూడికతీత వంటి పనుల ద్వారా నీటి సంరక్షణతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

**రాజకీయాలకు ఇది సమయం కాదు.. ప్రజలను కాపాడుకోవడమే లక్ష్యం:**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇది రాజకీయాలు చేయాల్సిన సమయం కాదని, ప్రజలను ఈ సంక్షోభం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలందరూ నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, ప్రభుత్వ చర్యలకు సహకరించాలని కోరారు. గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి, నీటి సంరక్షణతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మీడియా సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై ఘోర ప్రమాదం.. లారీని ఢీకొన్న కారు..

**ఇద్దరు యువకులు మృతి**

**మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**

**హుజురాబాద్, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం ముగించుకుని ఆనందంగా స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన యువకులను రోడ్డు ప్రమాదం కబళించింది. జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పుణ్యక్షేత్రం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన ఈ విషాద ఘటన రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఈ ప్రమాదం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారులోని 563వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకుని ఎర్టిగా కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారుకు చేరుకోగానే ముందు వెళ్తున్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన బట్టారి అరవింద్ (20), మచ్చ సాయి (20) తీవ్ర గాయాలతో కారులోనే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న ఎరుకల సాయి కృష్ణ, మచ్చ ఆదర్శ్, ముఖియా, వివేక్, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షణాల్లో జరిగిన ప్రమాదంతో జాతీయ రహదారిపై విషాదకర పరిస్థితి నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న హుజురాబాద్ రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా దెబ్బతినడంతో అందులో చిక్కుకున్న మృతదేహాలు, క్షతగాత్రులను బయటకు తీసేందుకు పోలీసులు, సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను తొలుత హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో మరో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

నేటి ప్రభాతదర్శిని
TS 24 0026809
www.netiprabhatadarshini.in 94932 72754



# 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు
# అవసరమైన అన్ని పనులు చేపట్టాలి







**పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు మంథనిలోని ప్రముఖ ఆలయాల సందర్శన**

**నేటి ప్రభాత దర్శిని మంథని, 2026 అక్టోబర్ 24:**

మంథని పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్ల పురోగతిని పరిశీలించిన పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులన్నీ చేపట్టాలని పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా లిపుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలు, అవసరమైన ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొందుతూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పుష్కరాల ప్రత్యేక అధికారి మరియు డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయం, ఓంకారేశ్వర స్వామి ఆలయం, సురబండేశ్వర స్వామి ఆలయం, మహాలక్ష్మి ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయాలను సందర్శించారు. ఆలయాల పరిస్థితి, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి,సీఈ దుర్గాప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ , తహసీల్దార్ ఆరిఫో ద్దీన్, ఈఓ రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు లారీ డ్రైవర్లు, క్లీనర్లకు లాభాల వాటా చెల్లించాలి

### - ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ డిమాండ్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

కైరుగూడ ఓపెన్ కాస్ట్ నుంచి గోలేటి సీహెచ్ పీ కి బొగ్గు రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల్లో వాటా రూ. 5,500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఏరియా (గోలేటి) డీజీఎం పర్సనల్ కిరణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో డీజీఎంను కలిసిన ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ, బొగ్గు రవాణా చేస్తూ సింగరేణి సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలు రావడంలో లారీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అర్హులైన డ్రైవర్లు, క్లీనర్లందరికీ లాభాల వాటా చెల్లించాలని, చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జల సంరక్షణ పనులు ప్రారంభం

**చొప్పదండి, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో విబి జి గ్రామ్ జి పథకంలో భాగంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా డ్రైనేజీ, సోక్‌పిట్‌లు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణ పనులు సర్పంచ్ బీర్ల ఆనందం ఇద్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ పనుల ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంచడంతో పాటు గ్రామంలో నీటి వనరులను సంరక్షించేందుకు అవకాశం కలుగుతుంది. గ్రామ పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంలో కూడా ఈ పనులు దోహదపడతాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర్ల ఆనందం ఏపీఎం సత్య ప్రకాష్, కార్యదర్శి మమత టీ ఏ సునీల్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ పాల్గొనారు.

## మూడు సంవత్సరాలుగా తెలంగాణలో రాక్షస పాలన

**అందుకే కాంగ్రెస్ ను వీడుతున్నాం**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

టీడీపీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలాలు కలిగిన నాయకులు ఈరోజు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శాసిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ నాయకుల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీని హెచ్చరిస్తూ నేను కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిపోతున్నానని ఎన్ ఎస్ యూ ఐ మాజీ స్టేట్ ప్రెసిడెంట్ భార్గవ్ దేశ్ పాండే వెల్లడించారు. శనివారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అయన మీడియాతో మాట్లాడారు. కానీ గత మూడు సంవత్సరాలుగా తెలంగాణలో రాక్షస పాలన సాగుతుందని అయన సొంత ప్రభుత్వంపై విమర్శలు చేసారు. తెలంగాణ యువతకు అభివృద్ధి కావాలి. మా యువతకు సూట్ అయ్యే నాయకుడు కేటీఆర్. కాబట్టి భారీ సంఖ్యలో యువత అందరం కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ చేరాలని నిశ్చయించుకున్నామని అన్నారు. మూడు సంవత్సరాల్లో మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. ఈ రాక్షస పాలనకు, కాంగ్రెస్ పార్టీకి స్వస్తి చెప్పాలని మా యువత నిర్ణయించుకున్నాం. రేవంత్ రెడ్డి ఎంతసేపు ప్రతిపక్ష నాయకులను తిట్టడం తప్పిస్తే అభివృద్ధి గురించి మాట్లాడడం లేదు. తెలంగాణలో జరిగే స్కాంలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని అన్నారు. పదేళ్లు ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసినం. కానీ ఇప్పుడు అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీని చంపేస్తున్నారని మండిపడ్డారు.

## దేవరగట్టులో శ్రీ మాళ మల్లేశ్వరుని బండారు మహిమ

**జటికీలకు గొలుసు తెంపిన గొరవయ్య బల్లూరు గాదిలింగప్ప.**

**తరలి వచ్చిన అశేష భక్త జనం.**

**హోళగుంద, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

మండల పరిధిలో విజయదశమి ఉత్సవాలో భాగంగా కర్రల సమరం అనంతరం ప్రాధాన్యత సంతరించుకున్న గొరవయ్యల ఆట,గొలుసు తెంపే కార్యక్రమం శనివారం అత్యంత ఉత్కంఠంగా సాగింది. ఉత్సవలో 3వ రోజు అయిన శనివారం గొరవయ్యల గొలుసు తెంపే కార్యక్రమాని తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులతో దేవరగట్టు కిటకిటలాడింది. సింహాసన కట్ట వద్ద కొలువుదీరిన స్వామివారి విరట్ మూర్తులు ఉన్న మల్లప్ప తాత గుడి ఎదురుగా ఇనుప గొలుసును తెంపటం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏటలా ఈ సారి కూడా బల్లూరు గ్రామానికి చెందిన గొరవయ్య గాదిలింగప్ప 03 జటికీలకు గొలుసు తెంపడంతో శ్రీ మాళ మల్లేశ్వరస్వామి ఢమరుగా నాథం,బండారు మహిమ ఎంతో మహిమాన్వితమైనదని భక్తులు పేర్కొన్నారు. దీంతో భక్తులు అయన భుజం పై ఎత్తుకొని డిర్ర్..ర్ర్...గోపరక్ అంటూ కేకలు వేశారు. ఈ గొలుసు తెంపే కార్యక్రమాని తిలకించేందుకు మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక,తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా మల్లప్ప గుడి వద్ద ఉన్న విరాట్ మూర్తుల ఎద్దుట గొరవయ్య తమ సంప్రదాయ నృత్యన్నీ ప్రదర్శించారు. త్రిశూలం, పిలనిగ్రోవి చేత పట్టి, ఢమరుకంతో ఆడిస్తూ చేసిన గొరవయ్యల నృథోత్సవం అందరిని ఆకట్టుకుంది. అలాగే గురు గొరవయ్యలు చాటలతో కొట్టుకుంటూ ఉద్వేగంగా వచనాలు చెప్పూ పునకంలో ఊగిపోయారు. ఈ కార్యక్రమంలో పిల్ల గొరవయ్యలు సైతం పాల్గొని దైవ వచనాలు వెలివేస్తూ దానికి తగ్గట్టుగా నృత్య ప్రదర్శన చేశారు. ఆలూరు,ఆదోని,గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దేవదాసిలతో సాయంత్రం వేళ దేవదాసి క్రీడోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం రంగుల నీళ్లను భక్తుల పై చల్లి వసంతోత్సవం,కంకణ విసర్జన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఉత్సవ విగ్రహాలను,పల్లకిని ఊరేగింపుగా కొండ పై ఉన్న ఆలయానికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఉత్సవాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## పటిష్ట బందోబస్తు మధ్య ముగిసిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పరిశీలన

**తుగ్గలి, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

తుగ్గలి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో తుగ్గలి ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం వద్దకు అభ్యర్థులు, వారి ప్రతిపాదకులను మాత్రమే అనుమతించి,అనవసర రద్దీని నియంత్రించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని,ఎన్నికలు ముగిసే వరకు ఇదే విధంగా బందోబస్తు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ రూరల్ సీఐ పెద్దయ్య నాయుడు, తుగ్గలి ఎస్సై బాల నరసింహులు, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున,తుగ్గలి మరియు జొన్నగిరి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ కుట్రలు అందరికి తెలుసు.. భూమా

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 24 (నేటి ప్రభాత దర్శిని) :**

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని కుట్రలు కుతంత్రాలు జరిగాయో ప్రజలందరికీ తెలుసని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలలో వైసీపీ నేతలు, మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదని ఏదో జరిగిపోతుంది ఏదో జరిగిపోతుంది అంటూ మాట్లాడుతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు మాట్లాడుతున్న విమర్శలు చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. గతంలో వైసిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 14 శాతం ఏకగ్రీవాలు జరిగాయన్న విషయం అందరికీ తెలుసన్నారు. 2014లో ఇదే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం రెండు శాతం మాత్రమే ఏకగ్రీవాలు జరిగాయన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం విషయానికొస్తే ఇక్కడ ఏకగ్రీవాల ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఓటమి భయంతో వైసిపి నేతలు నామినేషన్ విత్ డ్రా చేసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వివరించారు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?



పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %ఀ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.

# సోమవారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.

**కొనుగోళ్లకు సిద్ధమవుతున్న ఐకేపీ అధికారులు.. మహిళా సిబ్బందికి శిక్షణ.**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి) ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 24 :**

ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఐకేపీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా శనివారం ఐకేపీ మహిళా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కేంద్రాల నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలు తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డీపీఎం మాణిక్ రెడ్డి, ఏపీఎం వెంకటలక్ష్మి హాజరయ్యారు. సీసీఎస్‌లు మంగ్యానాయక్, దేవేందర్, వెంకటరమణ, సుదర్శన్, సుధాకర్‌తో పాటు వీవోఏలు, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో విధులు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# సిరిసిల్ల టాస్క్‌లో ఉచిత శిక్షణ

**ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం**

**డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అర్హులు.. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:**

సిరిసిల్ల టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్లో టెక్నికల్ కోర్సులు, బ్యాంకింగ్ బీ ఎస్ ఎఫ్ ఐలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో ఉన్న టాస్క్ రీజనల్ సెంటర్ లో ఈ నెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టాస్క్ లో శిక్షణ పొందిన అభ్యర్థులకు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు 95734 20718, 70755 22671లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ నాగేంద్ర చారి విచారణ

**తెర్లుమద్ది గ్రామంలో బాధిత కుటుంబాన్ని కొట్టిన ఘటనపై ఆరా.**



**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిది) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 24:**

మస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి శనివారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు పూర్వాపరాలపై ఆరా తీశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 20వ తేదీ రాత్రి తెర్లుమద్ది గ్రామంలోని బొడ్రాయి వద్ద డీజే నడుస్తుండగా, దానిని ఆపాలని గ్రామానికి చెందిన కొమ్మట మధు కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు తన ఇంటి వద్దకు వచ్చి తనతో పాటు తన భార్య, తన అన్నపై దాడి చేసి కొట్టినట్లు మధు ఆరోపించారు. ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 23వ తేదీన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి తెర్లుమద్ది గ్రామానికి చేరుకుని కేసుకు సంబంధించిన అంశాలపై విచారణ నిర్వహించారు. విచారణలో భాగంగా ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితుల ఆరోపణలు, ఇతర సంబంధిత వివరాలను పరిశీలించినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**గజ్జెల రాజు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**

**నేటి ప్రభాత దర్శిని,అక్టోబర్ 24(ముస్తాబాద్-ప్రతినిధి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే తొలి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నామాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మాదాసు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జల రాజు, మండల తాసిల్దార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గజ్జెల రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 2026--27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన యం ఎస్ పి ప్రకారం ధాన్యానికి నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు ?2,461 వరకు మద్దతు ధర లభించనుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల వద్ద తక్కువ ధరకు విక్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలోనే ఐకేపీ కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల రైతులకు రవాణా భారం, సమయం ఆదా అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.



ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన, గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా వంటి అంశాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల వద్ద ఎక్కువకాలం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పూర్తిగా అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి మాట్లాడుతూ, రైతులు కేవలం ధాన్యం అమ్ముకునే సమయంలోనే కాకుండా పంట సాగు దశ నుంచే ప్రభుత్వ వ్యవసాయ శాఖ సూచనలు, సాంకేతిక సహకారం పొందాలని అన్నారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకోవడం, నాణ్యమైన విత్తనాలు వినియోగించడం, పంట నాణ్యతను పెంచుకోవడం ద్వారా మంచి ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, హమాలీలు కొరత లేకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోడౌన్లు/మిల్లులకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో అధికారులను ఆదేశించారు. నామాపూర్‌లో ప్రారంభమైన ఐకేపీ కేంద్రం ద్వారా పరిసర గ్రామాల రైతులకు కూడా ప్రయోజనం కలగాలని, రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఐకేపీ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం రాహత్ పథకంతో రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**పీఎం రాహత్ పథకంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24:**





పీఎం రాహత్ పథకం(ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్)తో రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. పీఎం రాహత్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాదితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని సూచించారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర సేవల కోసం 112, సీసీటీఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా బాధితులకు వేగవంతమైన సేవలు అందుతాయని వివరించారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డాక్టర్ సంతోష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు ఇబ్బందులు రానీయొద్దు





**కలెక్టర్ చిత్రా మిశ్రా**

**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 24 :**

పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి లో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్-2) పోస్టుల భర్తీకి శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వాణి నికేతన్ డిగ్రీ , పీజీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష కాబట్టి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో 150 మంది అభ్యర్థులకు గాను ఉదయం 73 మంది, మధ్యాహ్నం 74 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు.